క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం



పూజల్లో పాల్గొన్న విప్ లక్ష్మణ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ

ధర్మారం: ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కమ్మరిఖాన్‌పేటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, బోనాల కార్యక్రమంలో లక్ష్మణ్‌కుమార్‌తో పాటు చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచు గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి, బీజేపీ నాయకుడు కన్నం అంజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు కాడే సూర్యనారాయణ, లావుడ్య రూప్లానాయక్, కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, కొత్త నర్సింహం, లింగయ్య గౌడ్, ఓరం చిరంజీవి, కాంపెల్లి రాజేశం, పానవేని స్వామి, లావుడ్య కొమురయ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్‌పోల్

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్లో గురువారం ఉపాధ్యాయులు ఎన్నికలు, మాక్‌పోల్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈవో సురేందర్ కుమార్, హెచ్‌ఎం సునీత, టీచర్లు సత్యప్రకాశ్ రావు, వెంకటేశ్, కిషన్, దినేశ్, వెంకటస్వామి, జోత్స్న, ఏసు, అజ్మత్‌బి పాల్గొన్నారు.

వంశీ విజయానికి కృషిచేస్తాం

రామగిరి: మంత్రి శ్రీధర్‌బాబు సారథ్యంలో కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ విజయానికి కృషి చేస్తామని ఎంపీపీ దంపతులు ఆరెల్లి దేవక్క, కొమురయ్య గౌడ్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జిగా శ్రీధర్‌బాబు నేతృత్వంలో గడ్డం వంశీ గెలుపు నల్లేరు మీద నడకేనని అన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న రాజయ్య దంపతులు

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్ గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రస్తుతం విగ్రహ ప్రతిష్ఠాపన, కొలుపు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నిర్వహణ ఖర్చుల నిమిత్తం గ్రామానికి చెందిన కొండ ప్రసాద్–సరిత దంపతులు రూ.51,116, అదేవిధంగా గంగమ్మ ఆలయానికి రూ.51,116 మొత్తం రూ.1,02,232 వారి తల్లిదండ్రులు కొండ సరోజన–రాజయ్య దంపతుల చేతుల మీదుగా ఆలయ కమిటీకి అందజేశారు.

నిరుద్యోగ యువతకు ఎన్టీపీసీ చేయూత

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సీఎస్సార్ సౌజన్యంతో నిరుద్యోగ యువతకు సీపెట్ ద్వారా ఆరు నెలల ఉచిత వసతితో కూడిన శిక్షణ అందించనున్నట్లు సీపెట్ అధికారి గోవిందు, సీఎస్సార్ ప్రతినిధులు వేముగంటి యుగంధర్‌రావు, శంకర్ తెలిపారు. గురువారం మేడిపల్లి సెంటర్ సాయి సేవా సమితి ఆవరణలోని వృత్తి విద్యా శిక్షణా కేంద్రంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) ద్వారా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఎన్టీపీసీ ప్రభావిత, పునరావాస గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువతకు చక్కని అవకాశమని వెల్లడించారు. దేశ, విదేశాల్లో నేరుగా మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగం పొందేందుకు సీపెట్ తోడ్పాటు అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఆర్థికంగా స్థోమత ఉన్న వారు సొంతంగా పరిశ్రమ ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా ఉందని, పరిశ్రమ ఏర్పాటులో సలహాలు, సూచనలు సీపెట్ అందిస్తుందని వివరించారు. వివరాలకు 99593 33417, 98495 90080 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దివ్యాంగ ఓటర్లకు ఫారం–12డి పంపిణీ

రామగుండం: రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 85ఏళ్లు దాటినవారితో పాటు దివ్యాంగ ఓటర్లను గుర్తించి వారికి నేరుగా ఇంటి నుంచే ఓటు హక్కు కల్పించేందుకు అనదపు కలెక్టర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు బీఎల్‌వోలు ఫారం–12డి దరఖాస్తులను పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలో పీడబ్ల్యూడీ ఓటర్లు 2,682, వీరితో పాటు 85 ఏళ్ల వయస్సు పైబడినవారు 570 మంది ఉండగా లోక్‌సభ ఎన్నికల్లో ఇంటి నుంచే తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



రహదారిపై పడిన బూడిద — ఓవర్‌లోడ్‌తో బూడిద లారీ (ఇన్‌సెట్లో) — వాహనాల వేగానికి లేస్తున్న దుమ్ము

బూడిద దుమ్ముతో అవస్థలు

- లారీల్లో పరిమితికి మించి లోడ్
- ఫోర్‌లేన్ రోడ్డుపై పడుతున్న వైనం
- దుమ్ముతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు, స్థానికులు

పాలకుర్తి: ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి బూడిదను తరలించే లారీల కారణంగా ఫోర్‌లేన్ రహదారిపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. లారీల నుంచి బూడిద రోడ్డుపై పడుతుండటంతో లేస్తున్న దుమ్ము వాహనదారులు, రహదారి వెంబడి వ్యాపారం చేసుకునే వారికి తీవ్ర సమస్యగా మారంది. ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు ప్రతీరోజు వందల సంఖ్యలో లారీల్లో బూడిద రవాణా జరుగుతుంది. లారీల్లో పరిమితికి మించి లోడ్ నింపడంతో పాటు పైన టార్పాలిన్ కవర్లు సరిగ్గా కప్పకపోవడంతో లారీలు సడన్ బ్రేక్‌లు వేసినప్పుడు, బ్రేకర్ల వద్ద బూడిద రహదారిపై కుప్పలు కుప్పలుగా పడుతోంది. ఫోర్‌లేన్ రహదారిపై వాహనాల వేగానికి కింద పడిన బూడిద.. దుమ్మురూపంలో కొట్టుకువచ్చి వాహనదారులపై పడుతోంది. దీంతో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దుమ్ము వాహనదారుల కళ్లలో పడడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మరోవైపు రహదారి వెంబడి ఉన్న హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థల నిర్వాహకులు, బస్టాండ్‌ల వద్ద బస్సులు, ఆటోల కోసం వేచి ఉండే ప్రయాణికులు సైతం బూడిద దుమ్ముమూలంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

హోటళ్ల వద్ద నిలబడలేని పరిస్థితి



బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద హోటల్ వ్యాపారం నిర్వహిస్తున్న. యాష్‌పాండ్ నుంచి బూడిదను సరఫరా చేసే లారీలు ఓవర్‌లోడ్‌తో, వేగంగా వెళ్లడంతో బూడిద రహదారిపై పడుతోంది. దీంతో విపరీతమైన దుమ్ము వస్తోంది. హోటల్ వద్ద నిలబడలేని పరిస్థితి నెలకొంది. అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు తీసుకోవాలి.

– మహ్మద్ రఫీక్, హోటల్ నిర్వాహకుడు

టార్పాలిన్ సరిగ్గా కప్పకపోవడంతో..



యాష్‌పాండ్ నుంచి బూడిదను తరలించే లారీలపై టార్పాలిన్ సరిగ్గా కప్పకపోవడంతో ఫోర్‌లేన్ రహదారిపై బూడిద.. కుప్పలు, కుప్పలుగా పడుతోంది. నిత్యం వందల వాహనాల రాకపోకలతో బీజీగా ఉండే రహదారి కావడంతో వాహనాల వేగానికి బూడిద దుమ్ము బైక్ వాహనదారుల కళ్లలో పడుతోంది. బసంత్‌నగర్ నుంచి పెద్దపల్లి వరకు కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

– కాల్వ మల్లేశ్, బోడగుట్టపల్లి

బేస్‌బాల్ క్రీడాకారిణికి అభినందన



అభినందిస్తున్న అదనపు కలెక్టర్, డీఈవో

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన జాతీయ స్థాయి బేస్‌బాల్ క్రీడాకారిణి బిరుదు మనస్వినిని అదనపు కలెక్టర్ అరుణశ్రీ, డీఈవో మాధవి గురువారం కలెక్టరేట్‌లో అభినందించారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కోర్బాలో జరిగిన పోటీల్లో ఆమె ప్రతిభ కనబరిచింది. రూ.3,200 విలువైన చెక్కును వారి చేతులమీదుగా అందుకుంది. విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, డీవైఎస్‌వో సురేశ్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి ప్రచారం



పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికలకు ఇంకా నామినేషన్ల సందడే మొదలు కాకున్నా.. బీజేపీ పెద్దపల్లి అభ్యర్థి గోమాస శ్రీనివాస్ ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్నారు. గురువారం పెద్దపల్లిలో జరిగిన పలు వివాహ వేడుకలకు హాజరై అక్కడకు వచ్చిన వారిని పలకరిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకే ఓటు వేయాలని అభ్యర్థించారు.

‘ఎన్టీపీసీ’ నిర్మిస్తే.. వ్యాపారులు కూల్చారు



గోడ కూల్చివేతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యం గురువారం ఉదయం నిర్మించిన ప్రహరీని మధ్యాహ్నం చిరు వ్యాపారులు కూల్చివేశారు. వివరాల్లోకి వెళ్తే.. మేడిపల్లి సెంటర్‌లోని గ్రీన్ బెల్ట్ స్థలంలో చిరు వ్యాపారులు నిర్మించుకున్న అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు ఇటీవల కూల్చివేయించారు. వారికి ప్రత్యామ్నాయంగా సండే మార్కెట్ స్థలం కేటాయించారు. దానికి యాజమాన్యం హద్దులు నిర్ణయించి, ప్రహరీ నిర్మించడంపై వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు కేటాయించిన స్థలానికి గోడ నిర్మించారని, వార సంతకు వెళ్లే దారిని కూడా మూసివేశారని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రహరీని కూల్చివేశారు. ఎమ్మెల్యే అక్కడికి చేరుకొని, వారికి బాసటగా నిలిచారు. రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందేవారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. దీనిపై ఎన్టీపీసీ యాజమాన్యంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు

రామగుండం: రంజాన్ పండుగ ఉపవాస దినాలు పురస్కరించుకొని గురువారం పట్టణంలోని జమా మసీదులో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లిం మతపెద్దలు, మసీద్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమనాయక్

రామగిరి: ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై పోలింగ్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని మంథని ఆర్డీవో హనుమనాయక్ అన్నారు. గురువారం సెంటినరీకాలనీ జేఎన్టీయూ కళాశాలలో పీవో, ఏపీవోలకు ఏర్పాటు చేసిన మొదటి విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని, మే 13న జరిగే పోలింగ్ విజయవంతం చేయాలని సూచించారు. మాక్ పోల్ నిర్వహణ, ఈవీఎంల పనితీరు, బ్యాలట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ల కనెక్షన్, వాటి పనితీరు, రిపేర్ వస్తే తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను తెలుసుకోవాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందే ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి, వీవీప్యాట్‌లలో ఉండే స్లిప్‌లు ప్రత్యేక కవర్‌లో ఉంచాలని, ఈవీఎం, వీవీప్యాట్‌లకు సీల్ వేయాలన్నారు. తహసీల్దార్లు ఆరిఫొద్దీన్, ఎ.నాగరాజు, రాంచందర్‌రావు, రాజయ్య, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని శివాలయం సమీపంలో గల చౌరస్తాలో బైక్‌ను మారుతి వ్యాన్ గురువారం ఢీకొనడంతో వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓదెల మండలం కనగర్తికి చెందిన మార్కసది కుటుంబంతో కలిసి సుల్తానాబాద్‌లోని జవహర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. పనినిమిత్తం బైక్‌పై వెళ్తుండగా మారుతి వ్యాన్ ఢీకొనడంతో సది కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు.

చెక్‌పోస్టు ఎత్తివేత

పాలకుర్తి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో మండల శివారులోని వేంనూర్ గ్రామంలో వాహనాల తనిఖీ కోసం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం ఎత్తివేశారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలపై సమావేశం

ఎలిగేడు: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి తిరుపతిరావు, ఎంపీడీవో భాస్కర్‌రావు ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు, నిర్వహణపై, సమావేశం నిర్వహించారు. ఎంఈవో కవిత, ఎంపీవో అనిల్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా, ఏపీఎం సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి: ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఎండపూట బయటకు వెళ్లకూడదని ఎంపీడీవో శశికళ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో నిర్వహించే ఉపాధిహామీ పనులు ఉదయం 11గంటల్లోపు పూర్తయ్యేలా చర్యలు చేపట్టామని, పనిస్థలాల వద్ద టెంట్‌లు, చల్లని వాటర్ తాగేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశామని వివరించారు.

మంథనిలో చలివేంద్రం ప్రారంభం

మంథని: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రధాన చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ, వైస్ చైర్మన్ సీపతి బానయ్య, కౌన్సిలర్లు చొప్పకట్ల హనుమంతరావు, వీకే.రవి ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండా గ్రామంలో గురువారం జరిగిన గౌతమి అనే యువతి వివాహానికి మాజీ సర్పంచ్ బదావత్ రాజునాయక్ రూ.10వేలు అందజేశారు.

లఘు చిత్రం ఆవిష్కరణ

కోల్‌సిటీ: సమాజానికి సందేశాత్మక చిత్రాలు అవసరమని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఓ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో, ఇటీవల చిత్రీకరించిన ‘మతమా, మానవత్వమా?’ లఘు చిత్రాన్ని ఆవిష్కరించారు. చక్కటి సందేశాత్మక కథాంశంతో స్థానిక దర్శకుడు దామెర శంకర్ లఘు చిత్రాన్ని నిర్మించడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో వంగ శ్రీనివాస్‌గౌడ్, పీఎస్ అమరేందర్, దయానంద్‌గాంధీ, సీహెచ్ ఉపేందర్, మేజిక్ రాజా, కుమార్ పటేల్, అందె సదానందం, గజెల్లి రాజలింగు, దామెర రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జ్ఞాపకార్థం ఫ్రిజ్ వితరణ

సుల్తానాబాద్: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు జ్ఞాపకార్థం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కుటుంబ సభ్యులు ఫ్రిజ్ అందజేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వాటర్ ఫ్రిజ్ అందించారు. కుటుంబ సభ్యులు బిరుదు సుశీల, ఖమ్మం అడిషనల్ ఎస్పీ రాయిళ్ల సాయిబాబా–స్వరూప, ఇంటలిజెన్స్ ఏసీపీ శేరి గిరిప్రసాద్–రత్న కుమారి, బిరుదు శ్రీనివాస్, శ్రీనిధి, అనిల్ దీప్తి, బిరుదు సంతోష్, శ్రీవాణి విద్యాసంస్థల కరస్పాండెంట్ రేకులపల్లి సుష్మ పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

జూలపల్లి: మండలంలోని తేలుకుంటలో ఓటరు నమోదుపై తహసీల్దారు బషీరొద్దీన్ అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన కల్పించారు. కార్యదర్శి కిరణ్, రాష్ట్ర సాధన ఉద్యమ నాయకురాలు గ్యాజంగి శ్యామల పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నారాయణాపూర్ గ్రామంలోని అంబేద్కర్‌నగర్ కాలనీవాసులు గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటికో బోనంతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి మొక్కులు సమర్పించి పూజలు చేశారు.

ప్లాస్టిక్ సామగ్రి సీజ్



ప్లాస్టిక్ సామగ్రిని సీజ్ చేస్తున్న అధికారులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ అధికారులు గురువారం నిషేధిత ప్లాస్టిక్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక రమేశ్‌నగర్ కిరాణ దుకాణాల్లోని ప్లాస్టిక్ సామగ్రి సీజ్ చేశారు. నగరపాలక సంస్థ హెల్త్ అసిస్టెంట్ కిరణ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ న్యూమారేడుపాకలోని శ్రీశాతవాహన ఉన్నత పాఠశాలలో 1989 నుంచి 2023 వరకు వెంకట్రావుపల్లిలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకుడు విద్యారత్న అవార్డు గ్రహీత పురం వెంకటమాధవరావు దంపతులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులందరూ కలిసి పాఠశాల కరస్పాండెంట్ మాధవరావుకు 10 గ్రాముల గోల్డ్‌తో పాటు రూ.50వేల నగదు బహూకరించారు.

కళాకారుడికి నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజయ్య

గోదావరిఖనిటౌన్: స్థానిక లెనిన్‌నగర్‌కు చెందిన జానపద కళాకారుడు అంబాల రాజయ్యకు అవార్డు వరించింది. వివిధ రంగాల్లో అందిస్తున్న సేవలను గుర్తించిన శిఖర ఆర్ట్స్ ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో నంది అవార్డు అందించింది.

సమన్వయంతో పనిచేయాలి

జూలపల్లి: గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఎంపీపీ రమాదేవి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ శాఖల అభివృద్ధి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అందరి లక్ష్యం అభివృద్ధేనని, గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎంపీడీవో పద్మజ, డీటీ అబూబాకర్, వైస్ ఎంపీపీ మొగురం రమేశ్, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

వైద్యుడి కోసం ఎదురుచూపులు



వైద్యుడి కోసం ఎదురుచూస్తున్న రోగులు

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే వైద్యుడు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఉదయం 9గంటల వరకే ఆసుపత్రికి రావాల్సిన సిబ్బంది 10గంటలు దాటినా ఆసుపత్రికి రాకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గురువారం ‘సాక్షి’ ఆసుపత్రిని సందర్శించగా కేవలం ఫార్మాసిస్టు, ఎల్.టి మాత్రమే ఉన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది సమయపాలన పాటించేలా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఈద్గా అభివృద్ధికి కృషి చేస్తా



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో కాంగ్రెస్ నేతృత్వంలో గురువారం ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు ఎండీ మునీర్ కోరిన విధంగా కాల్వశ్రీరాంపూర్ ఈద్గా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, నాయకులు మాదాసు సతీశ్, అల్లంల దేవేందర్, ఆరెల్లి రమేశ్, సబ్బని రాజమల్లు, బంగారి రమేశ్, బాల సమ్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కనగర్తిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఓదెల: మండలంలోని కనగర్తి గ్రామంలో గురువారం భూలక్ష్మి, మాలక్ష్మి బొడ్రాయి ఉత్సవాల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొన్నారు. ఈ సంబర్భంగా గ్రామదేవతల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

చలివేంద్రం ప్రారంభం

పెద్దపల్లిరూరల్: మండుటెండల్లో చల్లని మంచినీటిని అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పట్టణంలోని ప్రగతినగర్ చౌరస్తా వద్ద సయ్యద్ ఖలీద్ కొన్నేళ్లుగా అందించేలా ప్రోత్సహించిన ఉప్పురాజును ప్రశంసించారు. నాయకులు మస్రత్, ఎరుకల రమేశ్, ఆసిఫ్, ఓదెలు, అశోక్, తూముల మనోహర్ రావు, ఉప్పు రామచంద్రం ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



రామగిరి: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో

సుల్తానాబాద్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని జిల్లా మానిటరింగ్ అధికారి సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని శాస్త్రినగర్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సింగిల్ విండో కార్యదర్శి సంతోష్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు

రామగిరి: రైతులు తమ పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దని డీఆర్‌డీవో రవీందర్ సూచించారు. గురువారం మండలంలోని కల్వచర్ల, లొంక కేసారం, నాగెపల్లి, నవాబ్‌పేట, లద్నాపూర్, రాజాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. డీపీఎం రవి, ఏపీఎం స్వరూపరాణి, సీసీలు శంకర్, రమేశ్, శోభారాణి పాల్గొన్నారు.

జూలపల్లి మండలంలో..

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు కుమ్మరికుంట, కోనరావుపేట, పెద్దాపూర్ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి ప్రారంభించారు. ఏవో ప్రత్యూష, ఏఈవో శ్రీవాణి, మార్కెట్ సెక్రటరీ హమీత్, సంఘ సీఈవో సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఫెర్టిలైజర్‌సిటీ: మండలం గుంటూరుపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఏపీఎం సంగ సదానందం ప్రారంభించారు. వీవో అధ్యక్షురాలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ మండలంలో..

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో కాల్వశ్రీరాంపూర్ పీఏసీఎస్ నేతృత్వంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ జాహెద్ పాషా గురువారం ప్రారంభించారు. డీటీ ధీరజ్, ఆర్‌ఐ ఉదయశ్రీ, సీఈవో కోలేటి శ్రీనివాస్, ఎరబాటి రవి, రత్నం పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



పీఆర్ ఏఈ వరలక్ష్మి పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ ముత్తయ్యపటేల్

ముత్తారం: గ్రామాల్లో అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో రూ.కోట్లతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపించినా పట్టించుకోని పీఆర్ ఏఈ వరలక్ష్మిపై పలువురు ఎంపీటీసీలు ఆందోళన చేశారు. ఎంపీపీ జోక్యం కల్పించుకొని పీఆర్ ఏఈ పనితీరు బాగాలేదని అసహనం వ్యక్తం చేశారు. మండల పంచాయతీ అధికారి పనితీరు బాగాలేదని ఆరోపించారు. తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

తారురోడ్డు పనుల పరిశీలన

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ నుంచి పర్మనెంట్ టౌన్‌షిప్ రింగ్ రోడ్డు వరకు నిలిచిపోయిన తారురోడ్డు పనులు పునఃప్రారంభం కావడంతో స్థానిక 24వ డివిజన్ కార్పొరేటర్ కౌలిపాక సుజాత గురువారం పనులను పరిశీలించారు.